స్పందనకు 27 ఫిర్యాదులు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ప్రజల నుం అందే ఫిర్యాదులు, అర్జీలు రీ ఓపెన్ అయితే విభాగాధిపతే నేరుగా పరిశీలించాలని నగర అదనపు కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు స్పందన నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ స్పందనలో 27 ఫిర్యాదులు అందాయని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-తెనాలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకొనుటకు సచివాలయాల వద్ద బోర్డులను ప్రదర్శించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమం 14వ వార్డు చినరావూరుతోట 1,17వ సచివాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, మున్సిపల్ ఛైర్మన్ తాడిబోయిన రాధిక మాట్లాడుతూ 14,17 సచివాయల పరిధిలో సుమారు 17.13 కోట్ల రూపాయలతో సంక్షేమ కార్యక్రమంలు అమలు చేశామని అన్నారు. ఇంకా ఎవరికైనా ఏదైనా కారణాల వలన సంక్షేమ పథకాలు అందనట్లయితే వాటిని పరిష్కరించమని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కార్యాక్రమంలో టి.శేషాచలం, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-పొన్నూరు : ములుకుదురు గ్రామంలో పమిడి వెంకట లక్ష్మికి చెందిన పూరిల్లు గత ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వెంకట రోశయ్య ఆదేశాల మేరకు ఆదివారం వైఎస్సార్ పార్టీ గ్రామ నాయకులు చిన్న వెంకటసుబ్బారావు, రఘురామ విద్యాసాగర్, మునుస్వామి, రామాంజనేయులు బాధిత కుటుంబానికి రూ.10వేలు సహాయం అందించారు.

స్పందనకు 4 అర్జీలు

విశాలాంధ్ర-పొన్నూరు : సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 4 అర్జీలు అందినట్లు తహసిల్దార్ శ్రీకాంత్ కేదార్నాథ్ మీడియాకు తెలిపారు. 1బి అడంగల్-2, రైస్ కార్డు కొరకు-1, నివేశన స్థలాల్లో పశువుల వ్యర్థాలు తొలగించాలని-1 అర్జీ అందినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులకు పంపి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఈనో చూవీ బైట్స్ విడుదల

గుంటూరు: హేలియన్ సంస్థకు చెందిన ప్రముఖ డైజెస్టివ్ బ్రాండ్ ఈనో.. ఇప్పుడు నమిలేందుకు అనువైన యాంటాసిడ్, ఈనో చూవబుల్ బైట్స్ ను టాంగీ లెమన్, జెస్టీ ఆరెంజ్ రెండు రుచులలో విడుదల చేస్తునట్లు ప్రకటించింది. కొత్త ఈనో చూవబుల్ బైట్స్ అనేది ఆధునిక జీవనశైలి, బయట తినే అలవాట్లకు అనుగుణంగా రూపొందించిన ఒక ఆవిష్కరణ. ఈనో చూవబుల్ బైట్స్ సహజ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇందులో 1000 మి.గ్రా ఖటికా చూర్ణ శక్తిని కలిగి ఉండగా, ఇది ఒక నిమిషంలోపు ఎసిడిటీపై పని చేస్తుంది. ఇది సింగిల్స్ పిల్లో పౌచ్, 10ల ప్యాక్, 30ల ప్యాక్ మూడు ఎస్‌కెయులలో లభిస్తుంది.

శివాలయంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి: శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక హాజరై ప్రసాదాలు పంపిణీ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భగీరథ ట్రస్ట్ శివాలయంలో జరిగే ఉత్సవాలు, పర్వదినాలలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ వంటి ధార్మిక కార్యక్రమాల్లో ముందు ఉండటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, ట్రస్ట్ ప్రతినిధులు కగ్గా శ్రీనివాసరావు, రెడ్డి రాఘవ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : కార్తీక మాసం సందర్భంగా పేదలకు, వృద్ధులకు ప్రత్తిపాడు నుండి గుంటూరు వరకు అన్నదానం సోమవారం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మండల కార్యదర్శి ఎం.అంకమ్మరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకం మంచి నేస్తం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ, అక్షరాస్యత దినోత్సవం ప్రతిపాడు శాఖ గ్రంథాలయంలో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా వైస్‌సర్పంచ్ బాపతు వెంకటేశ్వర్ రెడ్డి, గ్రంథాలయ అధికారి బి.అరుణ మాట్లాడుతూ విద్యార్థులు పాఠకులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి జ్ఞానం సంపాదించుకోవాలని కోరారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అతిథులు అందరి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ 1 సుల్తాన్, ఎంపీటీసీ 2 గురుగూరి సాయి, భారత కమ్యూనిస్టు నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి అదేశ్వరరావు, వార్డు మెంబర్ డబ్లూరి కొండలు పాల్గొన్నారు.

చంద్రబాబు బెయిల్‌పై హర్షం

విశాలాంధ్ర-రొంపిచర్ల : టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేయటంతో సోమవారం టీడీపీ మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన రొంపిచర్లలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంచుకొంటూ సంబరాలు జరుపుకొన్నారు. జై చంద్రన్న, జైజై చంద్రన్న, న్యాయం గెలిచిందంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వివిధ ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఏ ఒక్క ఆధారం లేకపోయిన వైసీపీ నేతల ఒత్తిడితో చంద్రబాబును జైలులో ఉంచారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పులుకూరి జగ్గయ్య, నెల్లూరి పాపారావు, కల్లి మల్లారెడ్డి, పల్లెల అంజిరెడ్డి, అంచా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గర్భిణీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో మాతృ మరణాలు నివారించేందుకు ముఖ్యంగా రక్తహీనత ఉన్న గర్భిణీల ఆరోగ్యంపై సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్ లోని విసి సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాతృ మరణాల సమీక్షా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలో గత జూన్ మాసము నుండి అక్టోబర్ మాసము వరకు తెనాలి, గుంటూరు, మేడికొండూరు, పొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన ఆరు (6) మాతృ మరణాలపై సంబంధిత వైద్య అధికారులతో, బాధితుల బంధువులతో జిల్లా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకొని వైద్య అధికారులతో పూర్తిస్థాయిలో సమీక్షించి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ప్రసవాల కోసం వెళ్ళినప్పుడు వారు నివసించే ప్రాంతంలోని వైద్య అధికారులు అక్కడ ఉన్న వైద్య అధికారులకు సమాచారం అందించడంతో పాటు వారు రెగ్యులర్‌గా అక్కడ వైద్య సేవలు పొందేలా సమన్వయం చేసుకోవాలన్నారు. మాతృ మరణాలపై కారణాలను విశ్లేషించి భవిష్యత్తులో ఇదే తరహాగా మరణాలు జరుగకుండా మెరుగుపరచుకోవలసిన వైద్య సేవలపై నిపుణులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ మాతృ మరణాలు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. శ్రావణ బాబు, డిసిహెచ్ఎస్ సుబ్రమణ్య రాజు, ఐసిడిఎస్ పీడి ఉమాదేవి, డిప్యూటీ డియంఅండ్‌హెచ్ డా.అన్నపూర్ణ, మాతృ మరణాల కమిటీ మెంబర్ రాధిక రాయుడు, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారి డా.రత్న మన్మోహన్, డిఐఓ డా.కే.వి.సుబ్బరాజు, ప్రొఫెసర్ ఓబిజి హెచ్ఓడి డా.వి.అనైనా, జిజిహెచ్ వైద్యులు డా.సుష్మిత, డా.ప్రదీప్ రెడ్డి, డిపిహెచ్ఎన్ఓ కే. శాంత కుమారి, తదితర వైద్య అధికారులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పుతోనైనా జగన్ కళ్లు తెరవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా సోమవారం టీడీపీ యువత నాయకుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగరలోని సాయి మందిరంలో టీడీపీ నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు జగన్ రెడ్డికి చెంపపెట్టని, ఈ కేసులో చంద్రబాబు పాత్రపై కనీసం ప్రాథమిక ఆధారాలు కూడా లేవని కోర్టు స్పష్టం చేసిందని, కోర్టు తీర్పుతోనైనా ముఖ్యంత్రి జగన్ కళ్లు తెరవాలన్నారు. నియంతపాలనకు చరమగీతం పాడేందుకు చంద్రబాబు త్వరలోనే ప్రజాక్షేత్రంలోకి వస్తారని అన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టరు నిమ్మల శేషయ్య, మానం శ్రీనివాస్, రామినేని వెంకట రావు, ఎంపీ కార్యాలయం ఓఎస్‌డీ దేవినేని కరుణ చంద్రబాబు, వేములపల్లి విఠల్, దామోదర్ చౌదరి, రామకృష్ణ, చంద్ర మౌళి తదితర టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా గ్రంథాలయంలో బహుమతుల ప్రధానోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు (వారం రోజులు)ఘనంగా నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీషలు పేర్కొన్నారు. వారం రోజులు పాటు విద్యార్థినీ, విద్యార్థులు అనేక రకాల పోటీలు నిర్వహించారు. ఈ మేరకు సోమవారం నరసం రాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యాఖ్యాన సరస్వతి ఏవీకె సుజాత, లైబ్రేరియన్ మురళీకృష్ణ, న్యాయవాది ఎం.మృత్యుంజయరావు, సచివాలయ సెక్రటరీ ఎల్.శివా రెడ్డి, మైనింగ్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ డి.రామ చంద్రారెడ్డి ప్రతిభ చూపిన మొత్తం 120 విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నెంసీపీఎస్ స్కూల్ టీచర్ శివారెడ్డి, పీఎంసీ స్కూల్ టీచర్ షేక్.జిలానీ, ఎస్‌కెఎన్‌ఏపీ స్కూల్ టీచర్ గురు వారెడ్డి, పీహెచ్‌ఎస్ స్కూల్ టీచర్ సరిత, స్వాతి, సిబ్బంది పి.కోటేశ్వరి, పి.సుధాకర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐలో యోగా టీమ్ ట్రయల్స్ ఎంపికలు

విశాలాంధ్ర-మంగళగిరి: ఎన్నారై వైద్యశాలలో వైయస్సార్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్‌లలో యోగా (పురుషులు, మహిళలు) టీమ్ ట్రయల్స్ ఎంపికలు ఎన్నారై మెడికల్ కాలేజీలో నిర్వహించారు. 2023 డిసెంబర్ 1 నుండి 4వ తేదీ వరకు చెన్నై అన్నా యూనివర్సిటీలో జరిగే సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యోగా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు గాను ఈ సెలక్షన్స్ నిర్వహించడం జరిగిందని ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ త్రిమూర్తి, డీన్ డాక్టర్ లక్ష్మీ, ప్రిన్సిపల్ డాక్టర్ శివప్రభోథ్, పిడి గురునాథం, యోగ అధ్యాపకులు శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ హర్షణీయం : డాక్టర్ నిమ్మల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ నిమ్మల శేషయ్య అన్నారు. సోమవారం స్థానిక గుజ్జనగుండ్ల లోని ఆయన కార్యాలయం వద్ద స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బాణసంచా పేల్చి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేసు ఆలస్యమైనా న్యాయం, ధర్మం గెలిచిందన్నారు. జగన్ కక్షసాధింపు చర్యలు కోర్టు ముందు నిలబడవు అన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బాబుపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజాగ్రహంలో కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు.

నూతన విల్లాలకు భూమిపూజ

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎల్.ఎం.వెంచర్స్ నూతన విల్లాల నిర్మాణ కార్యక్రమానికి భూమిపూజ కార్యక్రమం సోమవారం కుంచపల్లిలో జరిగింది. ఈ సందర్భంగా ఎల్.ఎం.వెంచర్స్ ప్రతినిధి మహేష్ రెడ్డి మాట్లాడుతూ 2010 సంవత్సరం నుండి తాము మంగళగిరి నియోజకవర్గంలో నిర్మాణ రంగ వ్యాపారంలో ఉన్నామని గతంలో వివిధ కమర్షియల్ కాంప్లెక్స్ అపార్ట్ మెంట్స్ కట్టి ఉన్నామని అన్నారు. కుంచనపల్లిలో రెండవ విల్లాక ప్రాజెక్టు మొదలు పెట్టామని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నామని తెలిపారు. అధునాతన పరికరాలతో డ్రైనేజీ, వాటర్, గ్రీనరీ సిస్టంతో ఏర్పాటు చేస్తున్నామని లాభా పేక్షతో మేము వ్యాపారం చేయమని మమ్మల్ని నమ్మికొని ఉన్న కార్మికులకు మేలు జరిగే విధంగా కృషి చేయడమే తమ ధ్యేయమని ప్రతినిధులు ఎం.ప్రణీత్ రెడ్డి, టి.మహేష్ రెడ్డి తెలిపారు.

ఫిట్ ఇండియా వారోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోని విద్యార్థులలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందింపజేసి వారిలో నైపుణ్యాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా వారోత్సవాలు నిర్వహిస్తుందని ఎంఈవో మద్దిగుంట సాంబశివరావు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. వేల్పూరు జడ్పీపాఠశాలలో హెచ్ఎం మహబూబ్ సుభానీ, పీడీ కాకుమాను రాజేష్ పాల్గొని బాలబాలికలతో స్కిప్పింగ్ చేయించారు. హెచ్ఎం మాబుసుభాని మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులలో శారీరక దృఢత్వం, ఆరోగ్యకరమైన జీవనశైలి, పోటీతత్వం వృద్ధి చెందుతాయని, విద్యార్థులు చిన్నతనం నుండే క్రీడలపై ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పీడీ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు యోగాను ఆచరించడం వలన ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయని తెలిపారు.

ప్రభుత్వాల విధానాలు తిప్పికొట్టాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, ఏపీలోని రాజకీయ పక్షాలన్నీ ఏకమై రాష్టానికి జరిగిన అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధా నాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అన్నారు. కృష్ణా జలల పంపిణీపై కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలని, రాష్ట్రంలో కరువు సమస్యల్ని పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో సీపీఐ చేపట్టిన 30 గంటల నిరసన దీక్షలో జంగాల పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల సందర్భంగా కృష్ణా జలాల పున:పంపిణీ అంటూ కేంద్రం మరో కుట్రకు తెరతీసిందన్నారు. కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే విధంగా ఉందని, రైతాంగాన్ని నష్టపరిచే గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఓట్లు దండుకోవటం కోసం తెలంగాణకు మేలు చేసే విధమైన కృష్ణ జలాల గెజిట్ ప్రవేశపెట్టటం అన్యాయమన్నారు. ఏపీకి రావలసిన నీటవనరులు దక్కకుండా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కృష్ణా జలాల పున:పంపిణీపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్రంలో కరువు తీవ్రతను, రైతుల వెతలను పట్టించుకోవడం లేదన్నారు. ఏపీ 400కి పైగా మండలాల్లో కరువు తాండవిస్తుంటే జగన్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని దుయ్యబట్టారు.

వైసీపీ నాయకులకు ఆట మొదలయ్యింది: రవీంద్ర

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఇక నుంచి వైసీపీ నాయకులకు ఆట మొదలైందని.. చంద్రబాబు ఒకసారి జనం మధ్యలోకి వస్తే వారి పతనం ప్రారంభమవుతుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ కోవెలమూడి రవీంద్ర అభిప్రాయపడ్డారు. హైదరాబాదులోని చంద్రబాబునాయుడు నివాసం వద్ద కోవెలమూడి రవీంద్ర (నాని), గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభా కర్‌తో కలిసి బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ... ఇన్ని రోజులు చంద్రబాబుపై ఇష్టానుసారం మాట్లాడిన వారు ఇక నుంచి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ ఇకనుంచి మరింత ఉత్తేజంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడుకి రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయటంతో స్థానిక కోవెలమూడి రవీంద్ర కార్యాలయం వద్ద తెలుగు మహిళలు, పార్టీ నేతలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి జ్యోతి, ఉప్పుటూరి పేరయ్య, అబ్దుల్ రహీం, శివ జ్యోతి, కురంగి శ్రీనివాస్, కొణికి వినోద్, ప్రమీల,నాగూర్, అస్మా, చంద్రగిరి బాబు, నవమి, కరిమున్నిసా, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి: చాంద్‌బాషా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం ప్రాధాన్యతా అంశంగా తీసుకుని చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఛాంద్‌బాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఎ గుంటూరు జిల్లా కార్యాలయం నందు జరిగిన సమావేశంలో చాంద్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు గత రెండు సంవత్సరాలుగా పెండింగులో ఉన్న సరెండర్ లీవ్ బిల్లులు...గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బిల్లులు.. మెడికల్ మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు..ఏపీ జీఎల్ఐ బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్నటువంటి జీపీఎఫ్ డబ్బులు కూడా వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి కరిముల్లాషా ఖాదిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి సాయి అభిజిత్, సయ్యద్ జాకిర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం

విశాలాంధ్ర-తాడికొండ: అన్ని వర్గాలకు న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు. నిడుముక్కల గ్రామంలో సోమవారం వై నీడ్ ఏపీ జగన్ కార్యక్రమం జరిగింది. జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయటం జరిగిందన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏనాడు అయినా పేదల గురించి పట్టించుకున్నాడా అంటూ నిలదీశారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మీకు అది చేస్తాం ఇది చేస్తామని బూటకపు వాగ్దానాలు ఇచ్చే వారు మీ ముందుకు వస్తున్నారని అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాదాసు రత్న కుమారియేసు రత్నం, ఎంపీటీసీ సుశీలమాజీ, ఎంపీపీ బండ్ల పున్నారావు, పార్టీ మండల అధ్యక్షులు బి వెంకటేశ్వర రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి, చిమట పూర్ణచంద్రరావు, అత్తోట అక్కయ్య, కోట శ్రీనివాసరావు, వెంకటస్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం దురదృష్టకరం

విశాలాంధ్ర-గుంటూరు : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దురదృష్టకర సంఘటన అని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్‌చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ఒక ప్రకట నలో అన్నారు. ఆదివారం రాత్రి ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమా దంలో 40 బోట్లు కాలి బూడిద్కెన సంఘటన విచారకరమని, సదరు ప్రమాదంలో నష్టపోయిన బోటు యజమానులను ప్రభుత్వం ఆదుకో వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రమాద సంఘటనపై ప్రభుత్వం తక్షణమే విచారణ జరపాలని జమీల్ అహ్మద్ బేగ్ డిమాండ్ చేశారు.

పేదల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'జగనన్నే ఆంధ్రాకి ఎందుకు కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా సోమవారం పశ్చిమ నియోజకవర్గంలోని 31వ వార్డు ఏటీ అగ్రహారం జీరో లైన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ, అలాగే 35వ డివిజన్ నలంద నగర్‌లోని 99వ సచివాలయంలో కూడా జరిగింది. అనంతరం మాన్యం సెంటర్‌లో జరిగిన సభలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమ వివరాలతో కూడిన బోర్డులను ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ నారా చంద్రబాబు ప్రభుత్వంలో ఏ పని కావాలన్నా అధికారుల చుట్టూ, ఆఫీసులు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన... చివరికి జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇస్తేనే ఆ పనులు చేసి పెట్టేవారని ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అటువంటి పరిస్థితులు లేవని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని మీ ఇంటి వద్దకే వచ్చి వాలంటీర్లు అందజేస్తున్న ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని అన్నారు. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని, పేదలకు మేలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు హయాంలో ఏ ఒక్క పేదవాడికి సెంటు స్థలం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. లక్షల ఇల్లు నిర్మించిన ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని, ఇళ్ల స్థలాలను మహిళల పేరుతో రిజిస్ట్రేషన్ చేసిన ప్రభుత్వం కూడా వైసీపీ ప్రభుత్వమేనని అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు క్లస్టర్-2 అధ్యక్షులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి, షేక్ రోషన్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, వైసీపీ మహిళా నాయకురాలు గనిక ఝాన్సీ, వైసీపీ నాయకులు అంగడి శ్రీను తదితరులు హాజరయ్యారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అర్జీలు హేతబద్ధంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్పందన కార్య క్రమంలో ప్రజల నుండి వివిధ సమస్య నుండి అందిన అర్జీలను పరిశీ లించి సత్వరమే హేతుబ ద్ధంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖర రావు, ఆర్డీఓ శ్రీఖర్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 237 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించిన ఫిర్యాదులు తిరిగి రీ ఓపెన్ కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ సకాలంలో ఫిర్యాదులు పరిష్కరిస్తే బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లవని తెలియజేస్తూ ఇకపై పరిష్కరించవలసిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ గ్రౌండ్స్‌ను గుర్తించాలన్నారు. బిఎల్‌ఓలు, సూపర్ వైజర్లు ఇంటింటికి వెళ్ళి ఫారం 6,7,8 కి సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చదువంటే మాకిష్టం- గ్రంథాలయాలు మా స్వంతం

విశాలాంధ్ర, తెనాలి : చదువంటే మాకిష్టం-గ్రంథాలయాలు మా స్వంతం అంటూ బాలల కేరింతలతో ఉత్సాహపూరితంగా సోమవారం గ్రంథాలయ ఉత్సవాలు ముగిశాయి. తెనాలి, నెహ్రూరోడ్డులో కవిరాజు త్రిపురనేని భవనంలో శాఖా గ్రంథాలయం బాలలు, విద్యార్థులతో కళకళలాడింది. అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. బాలబంధు సమతారావు అవార్డును రచయిత నూతలపాటి నాగేశ్వరరావు, నాళం కృష్ణారావు అవార్డును మాచర్ల రచయిత డా.బెజ్జంకి జగన్నాధాచార్యులు, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ అవార్డును హైదరాబాద్ ప్రముఖ కవయిత్రి పిరాట్ల జయలక్ష్మి, డా.వెలగా వెంకటప్పయ్య అవార్డు విశ్రాంత గ్రంథాలయపాలకురాలు పిరాట్ల జయలక్ష్మికి, వెలగా వెంకటప్పయ్య అవార్డు విశ్రాంత గ్రంథాలయ పాలకురాలు (గుంటూరు) విజయశ్రీ పోగులకు అందజేశారు. ఈ సభకు ఆలపాటి కళావతి రవీంద్రపీఠం నిర్వాహకులు పాపులూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సభలో ఆలపాటి కళావతి, రవీంద్ర పీఠం అధ్యక్షులు ఐనాల మల్లేశ్వరరావు, టి.యం.రావు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.వి.ఆర్.ప్రసాద్, గ్రంథాలయ అధికారిణి కాపూరి రమాదేవి, యస్.లావణ్య సుధలు గ్రంథాలయ ప్రాధాన్యత, అవార్డుల గురించి మాట్లాడారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం గావించారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు: పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం కలిగి, మేధాశక్తి పెరుగుతుందని, ప్రపంచ జ్ఞానం పొందవచ్చు అని అశోక హైస్కూల్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పెదనందిపాడు శాఖ గ్రంథాలయం నందు సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం పెదనందిపాడు గ్రామ సర్పంచ్ దాసర పద్మారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్టియు గుంటూరు జిల్లా పూర్వ అధ్యక్షులు గేరా మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గత వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని, పెదనందిపాడు గ్రామ సర్పంచ్ దాసరి పద్మారావు, విశ్రాంత ఉపాధ్యాయులు బోరుగడ్డ శాంసన్, గుగ్గిలం సాయిబాబు, కొర్రపాటి సుహాసిని, వెంకటేశ్వర్లు, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అధ్యాపకుల సదస్సు

విశాలాంధ్ర-తాడేపల్లి: కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం రాష్ట్ర స్థాయి అధ్యాపకుల సదస్సు నిర్వహించినట్లు సదస్సు నిర్వా హకులు డాక్టర్ ఎస్.అరుణ్ మేత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ శాస్త్ర వేత్త డాక్టర్ ఎం.సతీష్, వరంగల్ ఎన్ఐటి నుండి డాక్టర్ రాకేష్ కుమార్, డాక్టర్ కె.తంగరాజు, రూర్కీ ఐఐటి నుండి డాక్టర్ కౌశిక్ పరిదా, హైదరాబాద్ నానోసోల్ నుండి డాక్టర్ ఎం.శంకర్ రావు ఎండి, ఎఫ్ ట్రానిక్స్ సిఇఒ రామకృష్ణ దాసరి, కడప యోగి వేమన విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ ఎంవి.శంకర్ ముఖ్య వక్తలుగా ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వాహకులు, కెఎల్‌యు అధ్యాప కులు డాక్టర్ ఎస్.అరుణ్ మేతా మాట్లాడుతూ ఆయా విద్యా సంస్థలలో, విభాగాలలో అధ్యాపకులుగా పని చేస్తున్న వారిలో టెక్నాలజీ పట్ల మరింత అవగాహ పెంచేందుకు గాను ప్రాయోజిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పేరుతో సదస్సును నిర్వహించినట్లు పేర్కొంది. కెఎల్‌యు వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, డీన్ అర్అండ్‌డి డాక్టర్ జయకుమార్ సింగ్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వివేకానందన్ వెంకటేశ్వరన్, అసోసియేట్ డీన్ అకడమిక్స్ డాక్టర్ అరవిందన్ అళగర స్వామి తదితరులు పాల్గొన్నారు.

వెలగపూడిలో టీడీపీ నేతల సంబరాలు

విశాలాంధ్ర-తుళ్ళూరు : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రెగ్యులర్ బెయిల్ వచ్చిన సందర్భంగా సోమవారం తుళ్లూరు మండల పరిధిలోని వెలగపూడి గ్రామంలో టీడీపీ నేతలు సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొని, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ దనేకుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ

విశాలాంధ్ర-తుళ్ళూరు : గ్రంథాలయ అధికారి గిరిధర్ ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ సమావేశం ఏర్పాటు సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తుళ్లూరు మండల తహశీల్దార్ కె.కళ్యాణి, విశిష్ట అతిథిగా పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఆత్మీయ అతిథిగా వీఆర్వో కోటేశ్వరరావులు హాజరయ్యారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రాముఖ్యత గురించి ముఖ్య అతిథులుగా వచ్చిన వారు వివరించారు. తదుపరి ఈ సందర్భంగా తూళ్లూరు మండలంలోని ప్రాథమిక, ఉన్నత, ప్రైవేట్ పాఠశాల బాల బాలికలకు నిర్వహించిన పోటీలలో గెలుపుందిన విజేతలకు అతిథులు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

వెండి త్రిశూలం బహూకరణ

విశాలాంధ్ర - నకరికల్లు : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గంగా అన్నపూర్ణ సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వర స్వామి దేవ స్థానమునకు సోమవారం నకరికల్లు గ్రామానికి చెందిన తిరువీధుల శ్రీనివాసరావు - రమాదేవి దంపతులు రూ.2 లక్షల 25 వేల విలువ చేసే మూడు కేజీల వెండి త్రిశూలంను బహూకరించారు. వారిని ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. దేవస్థానమునకు విరాళాలు ఇచ్చేందుకు భక్తులు ముందుకు రావాలని తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - నకరికల్లు : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నకరికల్లు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. జెడ్పీహైస్కూల్ ఆవరణలో గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి, టి.నగేష్, ప్రధానోపాధ్యాయులు బి.శివకుమారి పాల్గొని విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కేసరి రమణారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ గ్రంథాలయాలను చదవటం మాకు ఇష్టం అనే కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, వీటిని విద్యార్థినీవిద్యార్థులు ఉపయోగించుకొని వృద్ధిలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత

విశాలాంధ్ర-సత్తెనపల్లి: బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న వీరవల్లి వెంకట సాయి తేజష్ అనే విద్యార్థికి ఆర్యవైశ్య సంఘాలు రూ.20వేలు ఆర్థిక సహకారాన్ని సోమవారం అందించారు. ఇంటర్మీడియట్ లోనూ, 10వ తరగతిలో ఉత్తమమైన మార్కులు సంపాదించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సాయికి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ అమ్మవారి దేవాలయంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షులు మధుసూదన్ రావు, మాజీ అధ్యక్షులు కొత్త లక్ష్మయ్య చేతుల మీదుగా రూ.20వేలు స్కాలర్షిప్ కింద అందజేశారు. సింగరి మధు, మాడా రమేష్, వేమా ప్రసాద్, కొత్తూరు విశ్వేశ్వరరావు, చిలకల వాసు, అన్నా సుమన్, జవాజి రవికృష్ణ, ఆత్మకూరి హరే రామచంచయ్య, తిరుమల సుధాకర్, శ్రీనివాసు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-అమరావతి: బండచేను కాలనీలో రూ.10 లక్షల విలువైన ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో వాసులతో మమేకమై స్థానిక సమస్యలపై చర్చించారు. కాలనీవాసులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యాక్రమంలో వైసీపీ నాయకులు హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-అమరావతి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అమరావతిలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వరికి సోమవారం స్థానిక ఎంపీపీ మేకల హనుమంతరావు, గ్రంథాలయ ఇంచార్జి ఎం.వెంకాయమ్మ చేతుల మీదగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పురందేశ్వరిని కలిసిన నాయకులు

విశాలాంధ్ర-వినుకొండ: ఒంగోలు పట్టణంలో జరుగుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి జిల్లా కార్యదర్శి మేడం రమేష్, వినుకొండ కన్వీనర్ యార్లగడ్డ లెలిన్ కుమార్, కో-కన్వీనర్ ఎం.వి.అప్పారావు కలిశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అర్థమయ్యే విధంగా తెలియజేయాలని అన్నారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు టీజీ వెంకటేష్‌ను కూడా కలిశారు.

వైద్య విద్యార్థినికి చేయూత

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సేవా కార్యక్రమాలతో పాటు బీద విద్యార్థుల చదువుల కోసం రోటరీ క్లబ్ చిలకలూరిపేట ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని క్లబ్ అధ్యక్షులు కాపు వెంకటరావు అన్నారు. గుంటూరులోని విక్టోరియా పారా మెడికల్ ఇన్స్టిట్యూట్‌లో అనస్తీసియా కోర్సులో డిప్లమో మొదటి సంవత్సరం చదువుతున్న పి.బిందు అనితకు రెండేళ్ల ఫీజును రోటరీ క్లబ్ ద్వారా అందించారు. విద్యార్థిని తండ్రి రవిశంకర్ నరసరావుపేటలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, తన ఫీజును చెల్లించుట కష్టతరమవుతున్నదని రోటరీ సభ్యులను సంప్రదించగా అమెరికాకు చెందిన జాగర్లమూడి జ్యోతిర్మయితో క్లబ్ అధ్యక్షులు సంప్రదించగా ఫీజులు చెల్లించుటకు అంగీకరించారు. ఈ కార్యక్రమంలో వివేకనంద సేవా సమితి కార్యదర్శి సత్యనారాయణ, రోటరీ డైరెక్టర్లు రోటరీ తోటకూర వెంకటనారాయణ, కందిమల్ల అంజిబాబు, ముత్తినేని వెంకటేశ్వర్లు, కందిమల్ల సాంబశివరావు, గళ్ళ సాంబశివరావు పాల్గొన్నారు, క్లబ్ కార్యదర్శి ఆళ్ల వేమన రెడ్డి వందన సమర్పణతో సభ ముగిసినది

కంగన్ వాటర్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: ఎనాజిక్ జపాన్ కంపెనీకి సంబంధించిన కంగన్ వాటర్ కార్యాలయాన్ని నరసరావుపేట రోడ్డులోని రాధాకృష్ణ పెట్రోల్ బంక్ పక్కన ప్రారంభించినట్లు కాంగన్ వాటర్ డిస్ట్రిబ్యూటర్స్ తోట హనుమ, అచ్యుత మోహన్, గర్రె నరసింహారావు తెలిపారు. ముఖ్య అతిథులు, గ్లోబల్ లీడర్స్ కె.నందకుమార్, పి. ఆంజనేయులు మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు నిర్మూలించుటలో కంగన్ వాటర్ ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. విశిష్ట అతిథిగా బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, వెంకాయమ్మ దంపతులు హాజరై మాట్లాడుతూ పరిశుభ్రమైన కంగన్ వాటర్ శరీరంలో కణాలను ఆరోగ్యయుతంగా ఉంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లి శివ, ఈ.రమేష్, టి.పిచ్చయ్య, సురా గుప్త, కజ్జాయం విజయలక్ష్మి, గజవల్లి పవన్ కుమార్, డి.మీరావలి, గట్టుపల్లి శ్రీనివాసరావు, ముద్దినేని యశోద రావు, చిలంకూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కేసు రాజకీయ ప్రేరేపితం, జగన్ కుట్ర : ప్రత్తిపాటి



విశాలాంధ్ర-చిలకలూరిపేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం పెట్టిన నైపుణ్యాభివృద్ధి కేసు వందకు వంద శాతం రాజకీయ ప్రేరేపితం, జగన్ కుట్ర అని తేటతెల్లమైందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. చంద్రబాబుకి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు తీర్పులో పేర్కొన్న అంశాలే చంద్రబాబు ఏ తప్పు చేయలేదనడానికి, జగన్ ప్రభుత్వ కుట్రలు, సీఐడీ అత్యుత్సాహానికి నిదర్శమని ప్రత్తిపాటి అన్నారు. మూడు దఫాలుగా సీఎంగా చేసిన వ్యక్తిని, ప్రధాన ప్రతిపక్ష నేతను కనీసం ఆధారాల్లేకుండా ఇన్ని రోజులుగా వేధిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరుపై చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయంలో సోమ వారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. హైకోర్టు తీర్పులో పేర్కొన్న అంశాల ప్రకారమే స్కిల్ కేసులో పసలేదని స్పష్టంగా తేలిపోయింది. త్వరలోనే ఈ కేసు నుంచి పూర్తిస్థాయిలో కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటపడతారు. జగన్ ప్రభుత్వం పెట్టిన మిగిలిన అక్రమ కేసులన్నీ కూడా రాజకీయ ప్రేరేపితం, దురు ద్దేశంతో పెడుతున్నవే. మధ్యంతర బెయిల్‌కు సంబం ధించి హైకోర్టు విధించిన షరతులు ఈ నెల 28తో తొలగిపోతాయని, 29నుంచి జగన్ ప్రభుత్వానికి అసలైన పండగ ఉంటుందన్నారు.

విద్యార్థులకు జాయింట్ ఎకౌంట్ తిప్పలు

విశాలాంధ్ర-శావల్యాపురం : జగనన్న విద్యా దీవెన (జేవీడీ) పథకం ద్వారా ఇప్పటి వరకు విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో నగదు జమ అయ్యేది. ప్రభుత్వం తాజాగా కొత్త మెలిక పెట్టింది. కొత్తగా విద్యార్థి, తల్లి ఇద్దరూ కలిసి ఉమ్మడి బ్యాంకు ఖాతా ఉండాలని నిబంధనలు తీసుకొచ్చింది. ఉమ్మడి బ్యాంకు ఖాతా ఉంటేనే నగదు జమ అవుతుందని పాఠశాల యాజమాన్యాలకు ప్రభుత్వం సమాచారం అందించారు. దీంతో విద్యార్థులు కళాశాలలకు సెలవు పెట్టి గ్రామాల్లో బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సర్వర్ పని చేయడంలేదని బ్యాంక్ సిబ్బంది తెలుపుతున్నారు. దీంతో విద్యార్థులు విసుగు చెంది వెనుదిరిగి పోతున్నారు. బ్యాంకు ఉమ్మడి ఖాతాల వివరాలను సచివాలయంలో సమర్పించేందుకు చివరి తేదీ ముంచుకొస్తుండడంతో విద్యార్థులకు ఏం చేయాలో పాలుపోలేని స్థితి ఏర్పడింది. ఏం జరుగుతున్నదో తెలియక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటివరకు తల్లి ఖాతాలో జమ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఈ మెలిక ఎందుకు పెట్టిందోనని ప్రజల నుండి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే విద్యార్థులకు జాయింట్ ఖాతాలు ఇప్పించేలా కృషి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దేవస్థానానికి రూ.ఐదు లక్షల విరాళం

విశాలాంధ్ర-వినుకొండ: శ్రీ గంగా పార్వతి సమేత రామ లింగేశ్వర స్వామి వారి దేవ స్థానానికి కొండమీద దేవాలయ పునరుద్ధరణలో భాగంగా సోమవారం కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని కొత్తపేటకు చెందిన అప్ప రాజు, సర్వమంగళ దేవి రూ. 5 లక్షల శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ఆయన నివాసంలో వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘంకు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సర్వ మంగళ దేవి గతంలో స్వామివారికి 25 లక్షల రూపాయలు వాగ్దానం చేసి ఉన్నారని, అందులో భాగంగా ఈరోజు ఆమె ఐదు లక్షల రూపాయలు అందజేశారు ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలవతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినుకొండ పట్టణ అభివృద్ధి సేవా సంఘం గౌరవ అధ్యక్షులు పెండ్యాల పుల్లారావు, చైర్ పర్సన్ పులిపాటి రామారావు, వైస్ చైర్ పర్సన్ చందోలు మల్లికార్జునరావు, గంధం బాలిరెడ్డి, జాగర్లమూడి సుబ్బారావు, కార్యదర్శి జాజుల మాల్యాద్రి, సహాయ కార్యదర్శి దండు చెన్నయ్య, కోశాధికారి రెడ్డి నగేష్, సహకోశాధికారి కన్నెగంట్ల అనంత రామ కోటేశ్వరరావు, ఈసీ మెంబర్స్ రామ తులసి రెడ్డి, తేలికపల్లి వెంకటే శ్వర్లు, అచ్యుత కృష్ణ, పొట్ల సుబ్బారావు, గోవింద నాయక్, పిఎస్ ఖాన్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు బెయిల్ సంతోషదాయకం

విశాలాంధ్ర-దుర్గి : తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు రెగ్యులర్ బెయిల్ రావడం సంతోషకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. తప్పుడు కేసులు న్యాయస్థానాల్లో నిలబడవని, న్యాయస్థానాలపై పూర్తి నమ్మకంతోనే ఇన్ని రోజులు అక్రమ కేసులపై పోరాడినట్లు చెప్పారు. తప్పుడు కేసులు న్యాయాస్థానాల ముందు నిలబడవని జగన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా తెలుసుకోవాలని, న్యాయస్థానాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నాన్ని ఏపీ సీఐడీ మానుకోవాలని సూచించారు. జగన్ రెడ్డి కళ్లలో ఆనందం కోసం ఇప్పటికీ సీఐడీ బుకాయించడం సిగ్గుచేటని, స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు జైలులో ఉంచడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తంచేశారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వైసీపీ నేతలు

విశాలాంధ్ర-అచ్చంపేట : పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, అమరావతి మండలంలో అక్రమ ఇసుక మైనింగ్ పాల్పడుతున్న అధికార పార్టీ నేతలని అచ్చంపేట మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అచ్చంపేట తహాశీల్దార్ చింతాడ పద్మదేవికి వినతి పత్రం అందజేశారు. చింతపల్లి, కొత్తపల్లి, ఇసుక క్వారీల్లో 2023, మార్చి 16తో అనుమతులు పూర్తయినా అక్రమైనింగు చేస్తుండటం ఏంటని ప్రశ్నిస్తే ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కోగంటివారిపాలెం రిచ్ కోర్టులో ఉన్న గానీ, యధా స్వేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని, ఈ నెల 16వ తేదీన అచ్చంపేట తహాశీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చిన గానీ ఇంతవరకు ఇసుక అక్రమ రవాణా అరికట్టకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, క్లస్టర్ ఇంచార్జ్ బత్తుల శ్రీనివాసరావు, షేక్ కాసుల తిరువయుపాటి ఆంజనేయులు, వల్లభనేని వెంకటేశ్వరరావు, షేక్ లాలు, షేక్ గని, పాతూరి డానియల్, యాంపొంగు ఆదం, చిర్ర జకరయ్య, కోట చంటి, కొమ్మవారపు దెబ్బయ్య, సందెపోగు వెంకట్రావు, మేకల హనుమయ్య, ఏసుపోగు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గురజాల: ఈనెల 26వ తేదీన నియోజకవర్గం కేంద్రం గురజాల నందు జరగబోయే సామాజిక సాధికార బస్సుయాత్ర కార్యక్రమనికి వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ రాజ్యాధికారానికి దూరంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీ వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన క్యాబినెట్‌లో చోటు కల్పించడమే కాకుండా వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అధికారానికి దూరంగా ఉన్న ప్రతి వర్గానికి అండగా నిలబడటం దేశ రాజకీయ చరిత్రలోనే మొదటిసారి అని అన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు గురజాల పట్టణంలో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బిసి నాయకులు హాజరవుతారు అని, ఈ బస్సు యాత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సి, ఎస్టీ, బిసిలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ బడేజాని, గురజాల-నడికుడి మార్కెట్ యార్డ్ చైర్మన్ కలకండ ఆంద్రయ్య, నాయకుడు గడిపూడి చెన్నయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ప్రవాసాంధ్రుల చేయూత

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలలలోని పేద విద్యార్థులకు ప్రవాసాంధ్రులు తమవంతు సహాయ, సహకారాలను అందిస్తూ వారిని ప్రోత్సహించడం శుభపరిణామమని వేల్పూరు జడ్పీపాఠశాల పీడీ కాకుమాను రాజేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగరీత్యా విదేశాలలో స్థిరపడిన ప్రవాసాంధ్రులు వేల్పూరి శివరామకృష్ణ, కాకుమాను వంశీ రానున్న పదవ తరగతి, ఇంటర్ పరీక్షలకు ఫీజు చెల్లించలేని పేద విద్యార్థులకు చెరో రూ.3వేలు విరాళంగా సమర్పించినట్లు తెలిపారు. దాంతో పాటు వేల్పూరి శివరామకృష్ణ నర్సరావుపేటలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థినికి బస్ ఫీజ్ నిమిత్తం రూ.11,500లను సమర్పించినట్లు తెలిపారు. అదే విద్యార్థినికి వేల్పూరు గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రులు బొల్లా శివరామమూర్తి, రాధిక దంపతులు మెస్ ఫీజు నిమిత్తం రూ.11500లను సమర్పించినట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్రస్థాయి వాలీ బాల్ పోటీలలో కీలకపాత్ర పోషించిన వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థిని తుర్లపాటి సాయిసుష్మ తండ్రి సీతారామయ్య క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ.5.600 విలువైన క్రీడా పరికరాలను పాఠశాల హెచ్‌ఎం మహబాబ్ సుభానీకి అందజేసినట్లు తెలిపారు. దాతలకు హెచ్‌ఎం, పీడీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు: మంత్రి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని రైతు భరోసా కేంద్రంలోనూ, ఈ క్రాఫ్ బుకింగ్‌లోను పేరు నమోదు చేసుకున్న రైతులే నేరుగా వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో తమ పంటను విక్రయించుకోవచ్చని రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు అన్నారు. సోమవారం మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీఐ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఏఎంసి చైర్మన్ పెండెం బాబురావు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ దళారులను ఆశ్రయించుకుండా నేరుగా రైతులే విక్రయించు కోవాలన్నారు. పంట నాణ్యతను బట్టి ధర లభిస్తుందని, కనీస మద్దతు ధరగా క్వింటాకు రూ.7,020గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు సహారా మౌలాలి, యువజన సంఘ నాయకులు శివ ప్రసాద్ రైతు సలహా మండలి సభ్యులు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

మా భవనాన్ని ఖాళీ చేయించండి: విశ్రాంత ఉద్యోగులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి వారి ఆందోళన కార్యక్రమం 6వ రోజుకు చేరింది. ధర్నా శిబిరానికి రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెలుగూరి సుబ్బారాయుడు, జనసేన బాధ్యులు కొమ్మిశెట్టి సాంబశివరావు మాట్లాడుతూ అద్దె గడువు పూర్తి అయినప్పటికీ పయనీర్ ఆటో మొబైల్ షాపు ఖాళీ చేయకుండా పెన్షనర్స్‌ను చాలా యిబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. షాపు యజమాని జవ్వాజి సాంబశివరావు (గాంధీ) అన్యాయంగా, ఆక్రమంగా వ్యవహరిస్తున్నాడని, ఈ అన్యాయాన్ని తప్పకుండా అధికారులు పరిశీలించి 'పరిష్కరించి పెన్షనర్స్‌కు సహకారం అందిస్తామన్నారు. పెన్షనర్స్ సమస్యను తెలియజేస్తూ వినతి పత్రం రెవిన్యూ డివిజన్ అధికారికి అందజేశారు. షెన్షనర్స్ పడుతున్న యిబ్బందులను దృష్టిలో పెట్టుకుని అక్రమంగా ఆద్దెకు ఉంటున్న పయనీర్ అటో మొబైల్ షాపును వెంటనే ఖాళీ చేయించాలని పెన్షనర్సు అసోసియేషన్ సభ్యులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జమురు హరిరావు, దాసరి శృంగారం, జె.లక్ష్మీనారాయణ, కే.రంగారెడ్డి, కేఆర్‌జే ప్రసాద్, లియొ రాజు, కె.పోతులూరయ్య, కె.అంతయ్య, కె.వెంకట్రావు, ప్రభుదాసు, ఎంజే నాయుడు, నాసరయ్య, మొహియుద్దీన్, జయాబిన్సీన్, రమాదేవి, సుబ్బారావు, పి.చంద్రయ్య, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ధూళిపాళ్ళపై అక్రమ కేసు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : సంగం డెయిరీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌పై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాము అనే వ్యక్తి సంగం డెయిరీ వద్ద సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడితే...పోలీసులు ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై సెక్షన్ 307 కింద నాన్ బెయిలబుల్ కేసు పెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంగం డెయిరీ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, ఎంతోమంది జీవనోపాధి పొందుతున్నట్లు చెప్పారు. సంగం డెయిరీని తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. సంగం డెయిరీ లేకుండా చేయాలని స్వయంగా ముఖ్యమంత్రి రంగంలోకి దిగినా వల్లకాని పరిస్థితి ఏర్పడటంతో ఏదో విధంగా నరేంద్ర కుమార్‌పై కేసుల పెట్టాలన్న దురుద్దేశ్యంతో చేసిన పని అని ఆరోపించారు. సంగం డెయిరీని ఎలాగైనా స్వాధీనం చేసుకొని అమూల్ డెయిరీకి అప్పజెప్పాలన్న జగన్, సజ్జల కుట్రలు విఫలమవడంతో ఆయనపై కేసుల మీద కేసులు పెడుతున్నారని ఆరోపించారు.

గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-రాజుపాలెం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు రాజుపాలెం శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. సోమవారం జాతీయ గ్రంథాలయ ముగింపు వారోత్సవాల ఉత్సవం, బహుమతి ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజుపాలెం తహసిల్దార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఏ.నళిని గ్రంథాలయ ప్రాధాన్యత గురించి..పోటీ పరీక్షల్లో పాల్గొనటకు గ్రంథా లయాలు ఉపయోగించుట గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కె కవిత, గ్రంథాలయ అధికారి కేఎస్ఎస్ ప్రసాద్, ఉపాధ్యాయులు హరిబాబు, అనసూర్య, నరసింహారావు, పాఠశాల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు వెంకటేష్, రోశయ్య పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-ఈపూరు: పుస్తకం అమ్మలా లాలిస్తుందని నాన్నలా ఆదరిస్తుందని గురువులా హితబోధ చేస్తుందని ఒంటరితనంలో మంచి స్నేహితుడిలా అక్కున చేర్చుకుంటుందని, అందుకే పుస్తకం మన మస్తకాలకు పదునుపెట్టే ఆయుధం అయిందని ముప్పాళ్ళ గ్రంథాలయ అధికారిని ఎస్.నాగలక్ష్మి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని ముప్పాళ్ళ గ్రంథాలయం నందు విద్యార్థిని విద్యార్థులకు వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వ్యాసరచన బ్లెస్సి ప్రథమ బహుమతి, ఫణి శశిధర్ ద్వితీయ బహుమతి, శ్రావణ సంధ్య తృతీయ బహుమతి, చిత్రలేఖనం షీఫ ప్రథమ బహుమతి, ప్రణతి ద్వితీయ బహుమతి, వినయ్ చరిత్ తృతీయ బహుమతి, డిబేట్ మౌలాలి ప్రథమ బహుమతి, ఆనంద్ ద్వితీయ బహుమతి, కార్తిక్ కుమార్‌లు, సర్పంచ్ బి వెంకయ్య, బొల్లా నరసింహారావు చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను నాయక్, హెచ్‌ఎం ఎంపీపీ స్కూల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు పంపిణీ

విశాలాంధ్ర-ఈపూరు: రాష్ట్ర ప్రభుత్వం పశుబీమా పథకాన్ని ప్రవేశ పెట్టి అన్ని రకాల పశువులు, జీవాలకు బీమా చేసుకునే సదుపాయాన్ని అమలు చేస్తోందని, జీవాలు కలిగిన ప్రతి కుటుంబానికి పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను పంపిణీ చేస్తుందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాస మూర్తి అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో పశుపోషకులకు సోమవారం పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు ఆరోగ్య కార్డుల వల్ల రైతులకు సీజనల్‌గా తమ పశువులకు వేయించుకోవలసిన టీకాల వివరాలతో పాటు నట్టల నివారణ మందులు తేదీల వారీగా తీసుకోవలసిన చర్యలు అన్నీ కూడా కార్డులో పొందుపరిచారన్నారు. అలాగే రైతు కలిగి ఉన్న పశువుల వివరాలు చెవిపోగుతో సహా పొందుపరచి ఉంటాయని స్థానిక పశు వైద్యాధికారి వివరాలు కూడా ఉంటాయన్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం సంబంధిత వైద్యాధికారిని సంప్రదించవచ్చన్నారు. కృత్రిమ గర్భాదారణకు సంబంధించి పశువులలో ఎద ఇంజక్షన్ వేసిన తేదీ నమోదు చేసి మళ్లీ సరియైన సమయంలో గేదెకు చూడు పరీక్షకు తీసుకురావలసిన వివరాలు కూడా ఉంటాయన్నారు. అలాగే గర్భకోశ వ్యాధుల నివారణకు తీసుకోవలసిన చర్యలు గురించి కూడా పశు పోషకులకు వివరించారు. మండలంలో మొత్తం 6500 ఇప్పటివరకు 1050 పంపిణీ చేసినట్లు ఏడి తెలిపారు. మిగిలిన కార్డులను ఈ నెల ఆఖరిలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ వైద్యాధికారి సునీత, పశు పోషకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సాధికారత: మంత్రి

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో విప్లవాత్మక మార్పులను సీఎం వైఎస్ జగన్ తెచ్చారని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలో నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రకు వచ్చిన ఆయన ఏ1 కన్వెన్షన్ హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని 136 కులాలలను వెలికితీసి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. జగన్ 70శాతం సామాజిక న్యాయం చేశారని, చంద్రబాబు నాయుడు మూడుసార్లు సీఎం చేసి సామాజిక న్యాయం పాటించిన దాఖలాలు లేవన్నారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్ కావాలని నాడు-నేడు కార్యక్రమాన్ని చేపట్టి రూ.65వేల కోట్ల ఖర్చు చేశారని అన్నారు. రాష్ట్రంలో శరవేగంగా మార్పులు తెచ్చిన నాయకుడు జగన్ అని, గత ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల వారిని విస్మరించారని ఆరోపించారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ దళితుల జీవన ప్రమాణాల్లో మార్పులు, వెనుకబడిన వారికి ప్రత్యేక పథకాలు తెచ్చిన వ్యక్తి సీఎం జగన్ అని కొనియాడారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సాధికారతను అన్ని వర్గాలకు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే అఫీజ్ ఖాన్, వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవర ప్రసాద్, ఎమ్మెల్సీ కుంభా రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-దుర్గి: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు విభాగాలలో గ్రంథాలయ అధికారి పి.వేణుగోపి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. సోమవారం బహుమతులు ప్రధానోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్సై ఎం.శివ, యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. గెలుపొందిన విద్యార్థులకు వారు మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మొమెంటోలు దాత ఎస్‌వీఆర్ ఎలక్ట్రికల్స్ వెచ్చా శివ, పెద్దలు కటకం చినవెంకటయ్య, మాజీ విద్యాశాఖాధికారి ఎస్.గోపాలరావు, ఆఫీస్ సబార్డినేటర్ మాచర్ల మెర్సి, కె.శ్రీనివాసరావు, షేక్ అబ్బాస్, టి.లక్ష్మీ నారాయణ, వై.కొండలు పాల్గొన్నారు.

బాలల హక్కులు, బాధ్యతలపై అవగాహన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: శాఖా గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్వర్యంలో గడిచిన వారం రోజులుగా నిర్వహిస్తున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం బాలల హక్కుల దినోత్సవం కార్యక్రమం జరిగింది. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్మెంట్ సొసైటీ (గార్డ్స్) నిర్వహణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ అసిస్టెంట్ ప్లీడర్ (ఏజీపి) హాజరయ్యారు. బాలల హక్కులు, బాధ్యతల గురించి పిల్లలకు వివరించారు. పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలు గురించి చెప్పారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డా.పివి సుబ్బారావు పాల్గొని విద్యార్థులచే గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీ నిర్వహించారు. వారం రోజుల పాటు వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డి.ఆర్.ఎన్. ఎస్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ బెల్లంకొండ వీరాంజనేయులు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యాంగ్ మెన్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రతినిధి చుక్కా విన్సెంట్ పాల్ దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి ఎమ్.నాగుల్ మీరా వలి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై అవగాహన

విశాలాంధ్ర-దుర్గి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయం సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కె.సమతావాణి మాట్లాడుతూ ఉద్యోగుల్లో వ్యాయామం ద్వారా ఆరోగ్యం పెంపొందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈకార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని అన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు బండ్ల ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలో జరిగే ఆటల్లో సచివాలయ ఉద్యోగులతో పాటు గ్రామ ప్రముఖలను పిలవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎంపీడీఓ సమతావాణి ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో సమీక్షించారు. ఐహెచ్ఐఎల్ సంబంధించి వచ్చిన ఆర్జీలు పరిశీలించి అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వ్యక్తి గతంగా గాని, గృహనిర్మాణం ద్వారా మరుగుదొడ్లు పొందని వారు ధరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో ఈఓపీఆర్డి జి.ఎల్ఎన్ గుప్తా, పీఈఓటి జి.సుజాత, సుధీర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-శావల్యాపురం : విద్యార్థులు ప్రశ్నించడంతో పాటు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కెవీఆర్ మోహన్‌చంద్ అన్నారు. స్థానిక శ్రీరామ పబ్లిక్ స్కూల్ నందు సోమవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపును శాఖా గ్రంథాలయ అధికారి అర్జున్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. మోహన్ చంద్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల అలవాట్లను ఏప్పుడు గమని స్తూ, వారికి మంచి పుస్తకాలను అందజేయాలని, విద్యార్థులు మత విద్వే షాలకు దూరంగా ఉంటే మానవతా విలువలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అర్జున్, గ్రామస్తులు హనుమంతరావు, శ్రీనివాస్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-రొంపిచర్ల: సంతగుడిపాడు, శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవములు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు వేడుకలలో పాల్గొన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ ప్రధానోపాధ్యాయులు పి.ఎల్.బాలశౌరి, ప్రముఖ కవి అచ్చుల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని అన్నారు.

10th క్లాస్ మార్కులిస్ట్ పోయినది

తోట వెంకటేశ్వర్లు, తండ్రి మల్లయ్య అను నేను పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, గుళ్ళపాడు గ్రామ నివాసినై యున్నాను. అయితే ఈ నెల 13న మా స్వగ్రామమైన గుళ్ళపాడు నుండి నరసరావుపేటలోని కృష్ణవేణి కళాశాలకు బస్సులో వెళుతుండగా నాకు సంబంధించిన హాల్ టికెట్ నెం. **2214606593**గా ఉన్న పదవ తరగతి మార్కులిస్టు కనిపించకుండా పోయినది. ఎవరికైనా దొరికినయెడల సెల్ నెం. **9652806794** కు తెలియజేయగలరు.

బాలికల విద్యకు ప్రోత్సాహం అభినందనీయం

విశాలాంధ్ర-పర్చూరు: బాలికల విద్యను ప్రోత్సహించుటకు పాఠశాలను స్థాపించటం అభినందనీయమని మండల విద్యాధికారి వెంకటరామయ్య తెలిపారు. బాలికోన్నత పాఠశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలుల జరిగాయి. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యాల పోటీలలో విజేతలకు బహుమతులను అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థునులు పోటీలలో పాల్గొనట వలన విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. విద్యా లక్ష్యాలను చేరుకొనే వరకు ఇష్టంగా చదవాలని ఆకాంక్షించారు. గ్రంధపాలకుడు గుడిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వారోత్సవాలకు సహకరించిన బాలికోన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం అవని, ప్రిన్సిపాల్ షాఫియాబేగమ్ ఉన్నారు.

చీరాల వాసికి డాక్టరేట్

విశాలాంధ్ర - చీరాల : ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం గుంటూరు ప్రకాశం జిల్లాలోని మత్స్యకారుల ఆర్థిక, సామాజిక స్థితిగతులపై పరిశీలన చేసినందుకు చీరాల వుడ్ నగర్ కు చెందిన మేడబలిమి లుక్ స్టీవెన్ బాబుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి అర్థ శాస్త్ర విభాగంలో గౌరవ డాక్టరేట్ పిహెచ్ డీ లభించింది.ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ అధ్యక్షులు అయిన డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పరిశోధనలు చేశామని,హెచ్ ఓడి కె మధు బాబు అభినందించారని స్టీవెన్ బాబు తెలిపారు.

టీడీపీ నాయకుల సంబరాలు

విశాలాంధ్ర - మార్టూరు : స్కిల్ డెవలప్మెంట్ కేసులో పేద జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకు కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయటంతో మాటూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెదేపా నాయకులు కార్యకర్తలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు చంద్రబాబు నాయుడు నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో పార్లమెంటరీ ఉపాధ్యక్షులు తొండేపు ఆదినారాయణ, మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్ కామినేని జనార్ధన్, పర్చూరు మండల తెలుగు యువత అధ్యక్షులు మహమ్మద్ ఫరూక్, సెల్ సుభాని మండలంలోని పలువురు నాయకులు కార్యకర్తలు తెదేపా అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి బియ్యం, పండ్లు పంపిణీ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ఎస్ఆర్ అండ్ వీఎం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది కొప్పుల వాసుబాబు వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక కోటయ్య అనాధ వృద్ధాశ్రమానికి 26 కె.జి.ల బియ్యం బస్తా, పండ్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో అమరా వీరాంజనేయులు, పోలుదాసు రామకృష్ణ, వాసుబాబు, చారుగుళ్ళ ప్రసాద్, దేగల తిరుపతిరావు, శీరాం రమేష్,చింతా రమేష్, దరియా సాహెబ్, కె.వి.సుబ్బారావు, స్వామి, నరసింహారావు, అప్పారావు, జి.వై.ప్రసాద్, వాకింగ్ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - వేమూరు : భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన ఓటు హక్కును అర్హత కలిగిన ప్రతి ఒక్కరు సద్వినియోగపరచుకోవాలని తాసిల్దార్ జె.నాగరాజారావు తెలియ జేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవ గాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా దుతూ ఓటు హక్కు ఎందుకు కల్పించబడింది, ఓటు హక్కు ద్వారా కలిగే ప్రయోజనాలు, ఎందుకు ఓటు హక్కు వినియోగించుకోవాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును సద్వినియోగపరుచుకునే విధంగా ఎన్నికల సంఘం అవగాహన సదస్సు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్, కళాశాల ఉపాధ్యాయులు, వీఆర్వోలు,విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బీసీలకు అసెంబ్లీ లోకసభ స్థానా లలో రిజర్వేషన్ కల్పించాలని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు సోమవారం కలెక్టరేట్లోని స్పందన డీఆర్వో పి.వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ 1996 టిడిపి ప్రభుత్వ హయాంలో, 2008 లో కాంగ్రెస్ హయాంలో మొత్తం రెండుసార్లు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ తీర్మానం చేసి చట్టసభలలో లోక్ సభ, అసెంబ్లీ స్థానాలలో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్ కల్పించటానికి అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం జరిగిందన్నారు. 27 సంవత్సరాల తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వంలో పార్టీలు మారుతున్నాయి తప్ప చట్టసభలలో బీసీ వర్గాల రిజర్వేషన్ గురించి ఎటువంటి ప్రస్తావన తీసుకురావడం లేదని గుర్తు చేశారు. ప్రభుత్వాలు ఆ దిశగా పనిచేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గొర్ల ఏడుకొండలు, మోర్ల చిన్న వెంకటేశ్వరరావు ,కొమ్మన బోయిన వెంకట ఫణి కుమార్ లంబు సాంబయ్య,నాగూర్ ,దర్శి చిన భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనన్న కావాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : శాసనసభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, వైకాపా ఇంఛార్జి కరణం వెంకటేష్‌ల ఆదేశాల మేరకు మండలం లోని రామకృష్ణాపురం-1 సచివాలయం పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల డిస్ప్లే బోర్డును ప్రారంభించి, వైకాపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకే అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్బారావు, గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాలరెడ్డి, బుర్ల సాంబశివరావు,డాక్టర్ హైమా సుబ్బారావు, బోయిన కేశవులు, నల్లబోతుల రాజకుమార్, గోలి నాగరాజు, నాదెండ్ల కోటేశ్వరరావు, గుర్రం బుజ్జి, గుంటూరు వెంకట సుబ్బారావు, దివి జయరాం, కత్తుల దుర్గారావు, పసుపులేటి కోటేశ్వరరావు, బక్కా అద్దంకి రెడ్డి, సచివాలయం కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారథులు, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యున్నతికి కృషి చేయాలి: జేడీ శీలం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో మాట్లాడుతూ ప్రతి నెల 4 తేదీన బాపట్లలో పార్టీ విధి విధానాలపై సమావేశం ఉంటుందని తెలిపారు. ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు అందరూ చూస్తూనే ఉన్నారని ఎంత నిరంకుశ పాలన చేస్తుందో కచ్చితంగా మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రూ.500 కు గ్యాస్,100 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తుందన్నారు. ఏ ప్రభుత్వం చేయలేని విధంగా సుపరిపాలన అందించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రానికి రాజధాని అనేది లేదని యువతకు కూడా ఉద్యోగాలు లేవన్నారు. పోలవరం ఇప్పటి వరకు పూర్తి కాలేదని రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తుందని పార్టీ క్యాడర్‌కు హామీ ఇచ్చారు. పార్టీని నమ్ముకున్న వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసి పార్టీని రాబోయే ఎన్నికలలో అధికారంలోకి తీసుకువెళ్లాలని జెడి శీలం పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా చైర్మన్‌గా యార్లగడ్డ గోపి ప్రమాణ స్వీకార చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లామైనార్టీ అధ్యక్షులు పఠాన్ రాజేష్, శ్రీపతి ప్రకాష్, తాడికొండ వెంకటేశ్వర్లు, తోట శివానాగేశ్వరావు, దండు రేణుక, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీకి సమస్యల వెల్లువ

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 73 మంది వారి సమస్యలపై ఎస్పీ వకుల్‌జిందాల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి భాదితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదేపదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదని, పోలీస్ అధికారులే స్వయంగా బాధితుల వద్దకు వెళ్ళి ఆ ప్రదేశంలో విచారించి సకాలంలో చట్టపరిధిలో ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణిత గడువులోపు పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన ఇన్స్పెక్టర్ వి.మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కుల గణనకు సహకరించాలి

విశాలాంధ్ర-అద్దంకి; మున్సిపాలిటీలో ఈనెల 27నుండి డిసెంబర్ 4వరకు చేపట్టనున్న కుల గణన సర్వేకు పట్టణ ప్రజలు సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ కమీషనర్ డి.,శ్రీనివాసులు కోరారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అద్దంకి మున్సిపాలిటీలో చేపట్టనున్న కుల గణనకు సంబందించి సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్,సచివాలయ సిబ్బందికి,వార్డు వాలంటీర్లకు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ కుల గణనకు సంబందించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు. వార్డు కౌన్సిలర్‌లు,కుల పెద్దలు,సంఘ పెద్దలు,పట్టణ ప్రముఖులు వార్డు ప్రజలందరూ నూరుశాతం కుల గణన పూర్తిచేయుటకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్ దేసు పద్మేష్,వైస్ చైర్మన్ -2 కన్నెబోయిన అనంతలక్ష్మీ,వార్డు కౌన్సిలర్‌లు, మున్సిపల్,సచివాలయ సిబ్బంది,వార్డు వాలంటీర్లు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 17న గ్రాండ్ క్రిస్మస్ వేడుక

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 17,18 తేదీల్లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు.పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ప్రపంచ ప్రఖ్యాత సువార్తికులు పాల్ దినకరన్ హాజరై వాక్యోపదేశం చేస్తారన్నారు. కులాలు మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనాలన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి బాపట్ల నియోజకవర్గంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు జరపటం అనే ఒక ఆనవాయితీ శాసనసభ్యులు కోన రఘుపతి మొదలు పెట్టారని,దానినే ఇప్పుడు అందరూ నాయకులు ఫాలో అవుతున్నారని పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్ బాబు తెలియజేశారు. ఏదైనా ఒక మంచి ఆనవాయితీని తీసుకురావాలి అంటే అది కేవలం కోన రఘుపతికే సాధ్యం అన్నారు. దీనిపై ఇంకా పూర్తిస్థాయి వివరాలు రాబోయే రోజుల్లో తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాఘవరెడ్డి, వైసీపీ నాయకులు డేవిడ్, మని భూషణ్, జోగి రాజా, అదే క్యాథరిన్ రాజు మాల్యాద్రి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారిణి ఎస్.విజయ లక్ష్మి తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రంథాలయం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చెప్పారు.ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నిజాంపట్నం రెడ్ క్రాస్ చైర్మన్ కె. గౌరీ శంకర్, గ్రంథాలయ కమిటీ మెంబర్స్ షేక్ తాజుద్దీన్, కె.లక్ష్మీ నరసింహారావు, కొల్లిపర శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : కార్తీక మాసం పురస్కరించుకొని సూర్యలంకలో నల్లమోతువారి పాలెం సర్పంచ్ మాడా సుబ్రమణ్యం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మట్లాడుతూ సూర్యలంక సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు కార్తీక మాసం 4 సోమవారాల పాటు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి రోజు 4 వేల మందికి భోజనాలు చేశారున్నారు. చంద్రబాబు,పవన్ కళ్యాణ్ ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై అక్కసుతో అన్నదానానికి అనుమతి లేదన్న పోలీసులు, అధికారులు ఒత్తిడి తీసుకువచ్చి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుకు పర్మిషన్ లేదన్నారని తెలిపారు. టిడిపీ జనసేన ఫ్లెక్సీలు తొలగించాలని ఆదేశాలు చేయటంపై పోలీసులు, అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర తెలుగు రైతుసంఘం అధ్యక్షుడు పమిడి భాస్కరరావు, దొప్పలపూడి వెంకటఅప్పారావు, షేక్ మౌలాలి, గొర్రెమచ్చు ఆనందరావు, బెజ్జం వెంకటరావు, నంగు ఏడుకొండల రెడ్డి, అట్ల మురళికృష్ణ రెడ్డి, డీ.రాజా, వారి లక్ష్మారెడ్డి, ఇక్కుర్తి శ్రీనివాసరావ , దోకిన రామారావు, బీసబత్తిన రాజశేఖర్ , పెద్ది నాగకుమార్, మునిపల్లె చిన్న, కుమ్మరకుంట దాసు తదిరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర - చీరాల : బాలలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేందుకు కృషి చేయాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెంటెండ్ డాక్టర్ పి సుభాషిని అన్నారు.దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు చీరాల మండలం ఏపీ మోడల్ హైస్కూల్ ఈపూరుపాలెంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ బాల్యం అంటే ఆటపాటలే కాదని భవిష్యత్తుకు పునాది అని సమాజంలో ఉన్న చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అన్నారు. సెల్‌ఫోన్ సామాజిక మాధ్యమాలకు బానిసలుగా నేటితరం కారాదని,బాలల అక్రమ రవాణా పట్ల అవగాహన కలిగి ఉండాలని బాల్య వివాహాలకు బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా నిలవాలని అన్నారు. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని జే సరళ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మెదడు మేధస్సుకి నిలయంగా ఉండాలని అన్నారు. క్రీడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ దేవరపల్లి డేవిడ్ రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టాలని, విద్యపై ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని అన్నారు.దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం బాలలకు 54 హక్కులను ఇచ్చిందని వాటిలో 42 హక్కులు బాలలకు 43 నుండి 54 వరకు ప్రభుత్వం పిల్లలకు చేయవలసిన విధులు గురించి తెలియజేసిందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విజయ్ కుమార్, మహేష్,శివారెడ్డి, విజయలక్ష్మి,హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై నిందలు అవివేకం : వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై నిందలు మోపటం వైసీపీ ప్రభుత్వ కుటీల రాజకీయాలకు నిదర్శనమని అవివేకమైన చర్య అని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి నరేంద్ర వర్మ అన్నారు. స్కిల్ స్కాం కేసులో రాష్ట్ర హైకోర్టు సోమవారం చంద్రబాబుకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేయడంపై నరేంద్ర వర్మ హర్షం వ్యక్తం చేస్తూ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ అధినేతపై వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపుతోనే కేసులు పెట్టిందన్నారు. సూర్యుడుపై ఉమ్మి వేస్తే అది తిరిగి మన పైనే పడుతుందని ఇదే విషయం జగన్ ప్రభుత్వానికి వర్తిస్తుందన్నారు. తప్పుడు కేసులు పెట్టి నాయకులపై కక్ష పూరితంగా వ్యవహరించడం దారుణం అన్నారు.రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. తమ అధినేతను 53 రోజులు అక్రమంగా జైల్లో ప్రభుత్వం నిర్బంధించినప్పటికీ టిడిపి శ్రేణులు ఎక్కడా మనోధైర్యం కోల్పోలేదన్నారు. ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులపై మా పోరాటం ఫలించిందన్నారు. తప్పుడు కేసులు న్యాయస్థానాల్లో నిలబడవని టిడిపి మొదటి నుంచి చెప్తూనే ఉందన్నారు. ఇకనైనా జగన్ రెడ్డి బుద్ధి తెచ్చుకుని కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజలందరి ఆశీస్సులతో త్వరలోనే చంద్రబాబు ప్రజాక్షేత్రంలోకి వస్తారని.. టిడిపి క్యాడర్ మొత్తం రెట్టించిన ఉత్సాహంతో ఎన్నికలకు సిద్ధం కానున్నారని నరేంద్ర వర్మ తెలిపారు.

గిరిజనుల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - బాపట్ల : గడిచిన నాలుగున్నర ఏళ్లుగా వైసిపి ప్రభుత్వం గిరిజ నులకు ఇచ్చిన హామీలు అమలు చేయటంలో పూర్తిగా విఫలం అయ్యిందని పార్లమెంట్ ఎస్టీ అధ్యక్షులు తిరుమలశెట్టి శ్రీను తెలిపారు.కలెక్టరేట్ ఎదుట గిరిజన నాయకులుతో కలసి నిరసన నిర్వహించి స్పందన కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన కార్పొరేషన్ , గిరిజన సహకార సంస్థ , ఐటిడిఎలను, గిరిజన సలహా మండలి , ఎస్టీ కమిషన్ లను నిర్వీర్యం అయిపోయాయన్నారు. గిరిజన(ఎస్టీ) సబ్ ప్లాన్ నిధులు 5355 వేలకోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వచ్చిన 8000 వేలకోట్ల 14,15 వ ఆర్థిక సంఘం నిధులను పంచాయితీలు గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యుత్ బిల్లుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మింగేసిందన్నారు. రాజ్యాంగ పరంగా గిరిజనులకు అందాల్సిన ప్రయోజనాలు, సంక్షేమం అందనివ్వకుండా జగన్ రెడ్డి ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల శ్రీనివాసరావు, కోమరగిరీ నాగేశ్వరరావు, గుణ్ణం అంకమ్మరావు, బాకుల మురళి ,మహిమ రాజు, బొజ్జా రామ్ మోహన్ రావు , శ్రీకాంత్, సుబ్బారావు, మెలికా తిరుమల, వీరయ్య , సీమోను తదితరులు పాల్గొన్నారు.

కుందేరును కాపాడండి

విశాలాంధ్ర - చీరాల : సహజ సిద్ధమైన కుందేరును కబ్జా దారులు అక్రమిస్తున్నారని ప్రజా వేదిక రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి ఏసురత్నం అన్నారు. సోమవారం కుందేరు ఆక్రమణలు అరికట్టాలని ప్రజావేదిక ఆధ్వర్యంలో డీఆర్వో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ కుందేరును కబ్జా చేస్తుంటే అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు.ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోతే కుందేరు కనుమరుగై పోతుందన్నారు.కుందేరును కబ్జాదారుల నుంచి కాపాడాలని కుందేరును ప్రక్షాళన చేసి పారుదల కల్పించి ఇరువైపులా కాంక్రీట్ వాల్స్ నిర్మించి కుందేరుకు ఇరువైపులా ఉన్న మిగులు భూములను ఇల్లు లేని నిరుపేదలకు పంచాలన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కోఆర్డినేటర్ శీలం వెంకటేశ్వర్లు,సిపిఎం నాయకులు బాబురావు, కొండయ్య,జనసేన నాయకులు గూడూరు శివరామప్రసాద్,కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి రంగారావు,జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘంనాయకులు,ఇంధనం రమణ తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో భూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో భూముల సర్వేకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. సర్వే అధికారులు గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్,పంచాయతీ రాజ్ ఎస్.ఇ హరి నారాయణ, గ్రామీణ నీటి సరఫరాల శాఖ ఎస్.ఇ విద్యాసాగర్, పరిశ్రమల శాఖ జి.ఎం మదన్ మోహన్ శెట్టి , వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్ , మత్స్య శాఖ జె.డి సురేష్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు, పౌర సరఫరాల శాఖ డి.ఎస్.ఓ విలియమ్స్, డి.ఎం శ్రీలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, వైదన
సీల్డు టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన
తేది: 20-11-2023
బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం వైదన గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న చెరువు మరియు పెద్ద చెరువు యందు చేపలు వేసి పెంచి పట్టుకొను హక్కు **2023-24** సంవత్సరం నుండి **2024-2025** వరకు అనగా **30-06-2025** వరకు రెండు సంవత్సరముల కాలమునకు **తేది: 30-11-2023** ఉదయం 10 గంటల నుండి పంచాయతీ కార్యాలయం ఆవరణలో సీల్డు టెండర్లు మధ్యాహ్నం 1 గంట వరకు తీసుకొనబడి మరియు అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ వేలం వైదన గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరుగును. ఆసక్తిదారులైన టెండరుదారులు ధరావత్తుగా **రూ.800000/-** డిమాండ్ డ్రాఫ్టుని పంచాయతీ కార్యదర్శి, వైదన వారికి ఇచ్చి నమోదు చేయించుకొనవలెను. మిగిలిన షరతులకు గ్రామ పంచాయతీ కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.
బి. ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి, వైదన సెల్ నెం.8096943457
మేడ జయలక్ష్మి, సర్పంచ్, వైదన, సెల్ నెం. 9573929211

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

కులగణనపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : కులగణనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి, తహశీల్దార్ నెహ్రూబాబు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణన పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల లకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను పక్కగా పాటించి సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వే వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అలాగే ప్రభుత్వ పథకాలు ఏమి అగిపోవని చెప్పారు.కులగణన సర్వే గురించి ముందుగానే వాలంటీర్లు ఇంటింటి ప్రచారం నిర్వహించి అపోహలను తొలగించాలన్నారు. ఈ సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని, వాటికీ సంబంధించిన ధ్రువపత్రాలను అడగనవసరం లేదని, కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్న వారి ఫోన్ ఓటిపి ద్వారా సర్వే నిర్వహించవచ్చని చెప్పారు. మండల సచివాలయాల కన్వీనర్ నాజర్ ఖాన్, నిజాంపట్నం పంచాయతీ కార్యదర్శి పి.అజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన న్యాక్ బృందం

విశాలాంధ్ర-అద్దంకి; స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాలను న్యాక్ బృందం సభ్యులు ఈనెల 17,18 తేదీలలో సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి,మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాలలో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి గ్రేడ్‌ను నిర్ణయించుటకు ముగ్గురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం కళాశాలకు వచ్చినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈబృందానికి ప్రొఫెసర్ వసంత హేవలారెడ్డి నాయకత్వం వహించగా అనిల్ కుమార్ ,మనోజ్ కుమార్‌లు సభ్యులుగా వ్యవహరించారు.న్యాక్ ప్రమాణాల ఆధారంగా వీరు కళాశాలలోని అన్ని విభాగాలను ,అభివృద్ధి కార్యక్రమాలను, రికార్డులను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ప్రిన్సిపాల్ వి,మోహనరావు తెలిపారు. కళాశాల ఉన్నత గ్రేడ్ సాధనకు కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రతి ఒక్కరూ చిన్న తనం నుండి వివిధ రకాల పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని అప్పుడే విజ్ఞానం పెరుగుతుందని బల్లికురవ శాఖ గ్రంథ పాలకుడు ఏ రమేష్ బాబు అన్నారు.సోమవారం 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు మాట్లాడుతూ పుస్తక పఠనం ఎంతో విలువైనదని విద్యార్థిని విద్యార్థులు ఖాళీ సమయాలలో గ్రంథాలయమునకు వెళ్లి పుస్తక పఠనం చేయాలన్నారు.గ్రంథ పాలకుడు రమేష్ బాబు జనరల్ నాలెడ్జ్ లో విద్యార్థిని విద్యార్థులలో పోటీ తత్వం పెంచాలని దృఢ సంకల్పంతో విద్యార్థిని విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం అభినందనీయం అన్నారు.గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గత ఆరు రోజుల నుండి నిర్వహించిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ,విద్యార్థులకు బహుమతులు ప్రధానం జరిగినది.అనంతరం బల్లికురవ శాఖ గ్రంథ పాలకుడు ఏ రమేష్ బాబు,రమాదేవి దంపతులను జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

నిజాయితీకి నిలువెత్తు రూపం చంద్రబాబు

విశాలాంధ్ర - యద్దనపూడి : నిజాయితీకి నిలువెత్తు రూపం చంద్రబాబు టీడీపీ నాయకులు అన్నారు. అక్రమ కేసులతో చంద్రబాబుకు అవినీతి మరకలు అంటించలేరన్నారు.చంద్రబాబుకు రెగ్యులర్ బెయిల్ రావడం హర్షణీయం అన్నారు. ప్రజలలో చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసిపి అక్రమ కుట్రలకు పాల్పడిందన్నారు. ఎన్నికల్లో నేరుగా ఎదుర్కోలేక అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును జైల్లలో ఉంచాలని అనుకున్నారని చివరకు కోర్టులో న్యాయం గెలిచిందన్నారు. చంద్రన్న నీతి, నిజాయతీ, వ్యక్తిత్వం తలెత్తుకుని నిలబడిందన్నారు.50 రోజులైనా ఒక్క ఆధారమూ కోర్టు ముందు ఉంచలేకపోయారన్నారు. కుట్రలు, కుతంత్రాలు, న్యాయం ముందు బద్దలయ్యాయన్నరు. ఈ కార్యక్రమంలో నల్లపునేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు రాయపాటి సీతయ్య, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్, వజ్జా సుబ్బరామయ్య, బోయపాటి సాంబశివరావు, ఈరపనేని వాసు, సూరిశెట్టి శ్రీనివాసరావు,సింగ్ చంద్రశేఖర్, ఈదల అనిల్ కుమార్, షేక్ బాజీ రాయుడు పాల్గొన్నారు.

సంబరాల్లో టీడీపీశ్రేణులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తెదేపా శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ న్యాయం గెలిచిందని తమ నేత కడిగిన ముత్యంలా బయటికి వస్తాడని ఊహించిందేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు నాతాని ఉమామహేశ్వరరావు, గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తం, కౌతరపు జనార్ధన్ రావు, యాసిన్, బొగ్గుల పార్థసారథి, దేటా నాగేశ్వరరావు, నాసిక వీరభద్రయ్య, ఉసురుపాటి సురేష్, పిచ్చుక వెంకటసుబ్బారావు, సామ్యూల్, పాండు, రత్నబాబు, మల్లికార్జున్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరశింహస్వామివారి దేవస్థానం -సింగరకొండ
టెండరు ప్రకటన
బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం యొక్క ఈక్రింది పనులకు గాను 5వతరగతి రిజిస్టర్ సివిల్ కాంట్రాక్టుల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనికిగాను ది.**21-11-2023** ఉదయం **10** గంటల నుండి **03-12-2023** సాయంత్రం **5-00**గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. ది.**04-12-2023 ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5-00గంటల వరకు టెండర్లు ఇవ్వబడును.**టెండరు దరఖాస్తుతో పాటు టెండరు ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్‌గాగాని నగదు చెల్లించి రశీదు జతపరచవలెను. సీలు కవర్లు ది.**05-12-2023 ఉదయం 10-00గంటల వరకు** సదరు కార్యాలయం నందు స్వీకరించబడి అదే రోజు సాయంత్రం **4-00గంటల వరకు** కార్యనిర్వహణాధికారివారి కార్యాలయం నందు ఎగ్జిక్యూటివ్ దేవాదాయశాఖ వారిచే టెండర్లు తెరవబడును.

వ. నెం.	పనిపేరు	అంచనా విలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూల్ ఖరీదు	పనిపూర్తి చేయుకాలం
1.	డార్‌మిటరీ హాల్ గదుల నిర్మాణమునకు హిల్ ఏరియాను లెవలింగ్ చేయుట	5,00,000/-	5,000/-	1,000/-	రెండు నెలలు

ఏకారణం చేతనైనను కారణం తెలపకుండా టెండర్లు తిరస్కరించు అధికారం కార్యనిర్వహణాధికారికి కలదు.
సం/- కార్యనిర్వహణాధికారి